## క్లుప్తంగా

### కాలంరాజుపేటలో నేత్రవైద్య శిబిరం


కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ శ్రీనివాస్

గజపతినగరం: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో గురువారం నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ కె.శ్రీనివాసరావు 86 మందికి కంటిపరీక్షలు చేశారు. వీరిలో ఆరుగురిని శస్త్రచికిత్సలకు,అయిదుగురిని కళ్లద్దాలకు ఎంపిక చేశారు. సర్పంచ్ గేదెల ఈశ్వరరావు,ఆరోగ్య కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న యూటీఎఫ్ నేతలు

జామి: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక అల్లువీధి ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వి.వాసుదేవరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. విశ్రాంత హెచ్ఎం చలుమూరి సత్యనారాయణ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ కృషిచేస్తోందన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.ఎ.వి.ఆర్.కె.ఈశ్వరరావు, ప్రతినిధులు ఎం.తాతంనాయుడు, వెంకటనాయుడు, వాసుదేవరావు,రాజారావు, కె.వెంకటరావు పాల్గొన్నారు.

### 16న మండలసర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన ఈనెల 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రత్నం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మ న్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

### జాతీయ జెండాల పంపిణీ


జాతీయ జెండాల పంపిణీని ప్రారంభిస్తున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీని మండల పరిషత్ కార్యాల యం వద్ద ఎంపీపీ చల్లా చలంనాయుడు గురువారం ప్రారంభించారు. గ్రామాల్లోని పోస్టల్ కార్యాలయాలతో పాటు, స్వచ్ఛం ద సేవా, ఇతర సంస్థలకు జాతీయ జెండాలు పంపిణీ చేయనున్నట్టు స్థానిక పోస్టల్ ఉద్యోగులు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, సీనియర్ సహాయకులు ఎస్.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజనాల పరిశీలన

కొత్తవలస: మండలంలోని ముసిరాం ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంపీడీఓ వై.పద్మజ గురువారం పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందిస్తున్నదీ, లేనిదీ తనిఖీ చేశారు. వంటకాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యమే ధ్యేయంగా వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని చెప్పారు. పక్కాగా మెనూ పాటించాలని వంట నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీఓ వెంట ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### నకిలీ పోలీసుల అరెస్ట్

- నిందితులది ఎస్.కోట

సింహాచలం: పోలీసులమని చెప్పి ఒకరి నుంచి నగదు దోచుకున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పెందుర్తి ఇన్‌చార్జి సీఐ ఈదుల నరసింహారావు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 8న ఎస్. రాధాకృష్ణ అనే వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి బైక్‌పై అడవివరం నుంచి భైరవవాక వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైకు ఆపి మాట్లాడుకుంటుండగా ఆర్మీ టోపీ, ఖాకీ దుస్తులు ధరించిన ఇద్దరు వ్యక్తులు వారిని పోలీసులమని బెదిరించారు. రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రాధాకృష్ణ ఫోన్‌పే ద్వారా వారికి రూ.16,400 చెల్లించాడు. అనంతరం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ అసిరితాత ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి.. ఎస్.కోట మండలం ధర్మవరానికి చెందిన ఈతలపాక శివప్రసాద్, ఎస్.కోట దరి ఎరుకుల కాలనీకి చెందిన పట్నాసి అశోక్‌లను నిందితులుగా గుర్తించారు. గురువారం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. కాగా..శివప్రసాద్‌పై గతంలో 16 కేసులు నమోదై ఉన్నాయి. వీరిద్దరూ ఇంకా ఎవరినైనా బెదిరించి నగదు వసూలు చేసి ఉంటే.. 9490607979కు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ సూచించారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పిల్లలు, కౌమార బాలబాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోందని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం నేపథ్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఆల్బెండ్‌జోల్ మాత్రలను గురువారం పంపిణీ చేశారు. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులతో ఈమాత్రలు మింగించారు. అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగుల నివారణకు ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలంతా ఈ మాత్రలు వేసుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. ఎంపీడీఓలు, పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– గజపతినగరం/ చీపురుపల్లి/ ఎస్.కోట నెట్‌వర్క్


జామి: జామి ఉన్నతపాఠశాలలో ఆల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీని పర్యవేక్షిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సూర్యనారాయణ


చీపురుపల్లి: విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష


గజపతినగరం: కేజీబీవీలో విద్యార్థినులతో మాత్రలు వేస్తున్న జెడ్పీటీసీ తవుడు, అధికారులు


బొండపల్లి: దేవుపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు


లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో విద్యార్థినికి మాత్రవేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు


శృంగవరపుకోట: ఎస్.కోటలో బాలికోన్నత పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ శేషుబాబు, వైద్య సిబ్బంది


కొత్తవలస: కొత్తవలస హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న వైద్యులు


శృంగవరపుకోట: తలారి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు


దత్తిరాజేరు: కేజీబీవీలో విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, అధికారులు


వేపాడ: వేపాడ హైస్కూల్‌లో మాత్రల పంపిణీలో ఎంపీపీ సత్యవంతుడు

## పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టలేరా..?

- ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుల ఆగ్రహం

చీపురుపల్లి: ప్రభుత్వం ఇస్తున్న సరుకులతో పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టలేరా...యాభై మంది పిల్లలకే రుచికరంగా వండలేకపోతే ఎలా...? ఉపాధ్యాయులు కూడా రోజూ మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తింటే పిల్లలకు పెడుతున్న భోజనం ఎలా ఉంటుందో తెలుస్తుందని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యు లు గంజి మాలాదేవి, ఇండెల లక్ష్మీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చీపురుపల్లి పట్టణంలోని విజయాకాలనీ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలతో పాటు బాలుర ఉన్నత పాఠశాల, బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలను ఫుడ్ కమిషన్ సభ్యులు గురువారం పరిశీలించారు. విజయాకాలనీ ప్రాథమిక పాఠశాలలో పులిహోర, సాంబారును రుచి చూశారు. వంటకాలు రుచిగా లేకపోవడంతో పిల్లలు వీటిని ఎలా తింటారని నిర్వాహకులను ప్రశ్నించారు. పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులకు లేదా అని ప్రశ్నించారు. బాలుర ఉన్నత పాఠశాలలో మెనూ ప్రకారం సాంబారు బాత్ వండాల్సి ఉన్నప్పటికీ అన్నం, సాంబార్ విడివిడిగా వండడంతో ఇదెలా సాంబార్ బాత్ అవుతుందని అసహనం వ్యక్తం చేశారు. అలా వండితోనే పిల్లలు ఇష్టంగా తింటున్నారని ఉపాధ్యాయులు బదులిచ్చారు. గురుకుల పాఠశాలలో వంటల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ బి.డి.నాయుడు, డిప్యూటీ డీఈఓ పి.బ్రహ్మాజీరావు, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం సీఎస్‌డీటీలు పిన్నింటి రామారావు, శోభ, రవిశంకర్ తదితరులు వారి వెంట ఉన్నారు.


విజయాకాలనీ ప్రాథమిక పాఠశాలలో వంటకాలను పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యులు

### పోస్టల్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు

చీపురుపల్లి: స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని పోస్టల్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు విక్రయిస్తున్నట్లు చీపురుపల్లి సబ్ డివిజిన్ ఇన్‌స్పెక్టర్ టి.గౌతమ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హర్‌ఘర్ తిరంగా 2.0లో భాగంగా ప్రతీ సబ్ పోస్టల్ కార్యాలయం, బ్రాంచ్ పోస్టల్ కార్యాలయాల్లోనూ జాతీయ జెండాలు లభించనున్నట్లు తెలిపారు. 20/30 సైజ్‌లో ఉన్న జాతీయ జెండా కేరూ.25కే విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. పౌరులు తమ సమీప పోస్టల్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ, సిబ్బంది

గజపతినగరం: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ సూచించారు. మండలంలోని లోగిశ గ్రామంలో గురువారం'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 81 మందికి వివిధ వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ, పాఠశాల, గృహసందర్శన చేసి పిల్లలు, ప్రజలకు వైద్యతనిఖీలు చేశారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.

### పశువులకు 'లంపి' టీకాలు

గజపతినగరం: మండలం కెంగువ గ్రామంలో 397 పశువులకు తుమికాపల్లి పశువైద్యాధికారి ఎం.శశిభూషణ్‌రావు ఆధ్వర్యంలో లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలను గురువారం వేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1,448 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. , ఈనెల 30వ వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

గజపతినగరం: పంచాయతీ వార్డు మెంబర్లు, సర్పంచ్‌లకు సంబంధించిన ఉపఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఈనెల 8వ తేదీన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. గజపతినగరం మండలంలోని లోగిశ సర్పంచ్ స్థానానికి ఆ గ్రామ ఉన్నత పాఠశాలలో నామినేషన్లను అధికారులు స్వీకరించారు. ఆఖరి రోజు నలుగురు అభ్యర్థులు నామినేషన్‌లు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్.రమేష్‌కుమార్ తెలిపారు. కొండ్రోతు అనూష, కొండ్రోతు అప్పయ్యమ్మ, లోగిశ అమ్మన్న, లోగిశ గౌరీ తమ మద్దతుదారులతో వచ్చి నామినేషన్ పత్రాలు సమర్పించారు. 11వ తేదీన స్క్రూటినీ, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఎన్నికలు, కౌంటింగ్ ఉంటుందని ఆర్‌ఓ చెప్పారు.

**సర్పంచ్ స్థానానికి ఆరు నామినేషన్లు**

గంట్యాడ: మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామ సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి గురువారం ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే పెంట శ్రీరాంపురం, జగ్గాపురం గ్రామాల్లో రెండు వార్డు మెంబర్ స్థానాలకు ఆరు నామినేషన్లు వచ్చాయి. పెంటశ్రీరాంపురం సర్పంచ్ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుగా కరక గౌతిమి, వార్డు మెంబర్‌గా గేదెల విజయ నామినేషన్‌లు వేశారు. ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసిం హమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, పెంట శ్రీరాంపురం ఎంపీటీసీ శ్యామల, ఉప సర్పంచ్ కరక మహేష్ పాల్గొన్నారు.

**నాలుగు వార్డు స్థానాలకు ఎనిమిది నామినేషన్లు**

బొండపల్లి: మండలంలో 4 వార్డు స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నికకు సంబంధించి 8 నామినేషన్లు దాఖలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు తెలిపారు. దేవుపల్లిలోని 13 వార్డుకు 5 నామినేషన్లు వచ్చాయి. మరువాడ- 2వ వార్డుకు దాసరి కాంత, కొండకిండాం -5వ వార్డుకు సంగంరెడ్డి సీతారత్నం, ఒంపల్లి-2వ వార్డుకు దొంతల అప్పలనారాయణ నామినేషన్ వేశారు. దేవుపల్లి-13వ వార్డుకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో మలిరెడ్డి శ్యామలరావు, ఇట్లా తిరుపతిరావు, మల్లపురెడ్డి మన్మథరావు మూడు సెట్లు నామినేషన్లను దాఖలు చేయగా.. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


గంట్యాడ: పెంటశ్రీరాంపురం సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న అభ్యర్థి గౌతమి, చిత్రంలో ఎంపీపీ హైమావతి, తదితరులు


గుర్ల: గొలగాం-8వ వార్డుకు నామినేషన్ వేస్తున్న అభ్యర్థి కరణం రమేష్

**గుర్ల మండలంలో..**


గుర్ల: మండలంలోని గొలగాం వల్లాపురం, దేవునికణపాక గ్రామాల్లో మూడు వార్డు మెంబర్ స్థానాలకు మూడు నామినేషన్లు వచ్చాయని ఆర్‌ఓ, ఈఓపీఆర్డీ గాయత్రి తెలిపారు. వల్లాపురం-8వ వార్డుకు నందా సుశీల, గొలగాం-8వ వార్డుకు కరణం రమేష్, దేవునికణపాక-8వ వార్డుకు కొర్నాన తాతప్పడు గురువారం నామినేషన్ వేశారు. ఆయా వార్డులకు ఒక్కొక్క నామినేషనే రావడంతో ఆ స్థానాలు ఏకగ్రీవం అవుతాయని అధికారులు తెలిపారు.

**కొత్తవలస మండలంలో..**

కొత్తవలస: మండలంలోని కాటికాపల్లి, తుమ్మికాపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో రెండు వార్డు మెంబర్ స్థానాలకు రెండు నామినేషన్లు అందాయని ఆర్‌ఓ కె.ధర్మారావు గురువారం తెలిపారు. కాటికాపల్లి-3వ వార్డుకు చుక్క భవాని, తుమ్మికాపల్లి-3వ వార్డుకు కెంగం జ్యోతి నామినేషన్ వేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు పీతల అప్పలకృష్ణ, విరోతి కొండలరావు పాల్గొన్నారు.

**ఆరు వార్డులకు పది నామినేషన్లు**

వేపాడ: మండలంలో ఆరు వార్డులకు జరిగే ఉప ఎన్నికలకు పది నామినేషన్లు దాఖలయ్యాయని ఎంపీడీఓ బి.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్ తెలిపారు. ఆఖరిరోజు గురువారం వల్లంపూడిలో రెండు వార్డుల కు నాలుగు, బొద్దాం, జగ్గయ్యపేటలో ఒక్కో వార్డుకు రెండు చొప్పున నామినేషన్లు అందాయి. శింగరాయి, కె.ఆర్.పేట పంచాయతీల్లో ఒక్కో వార్డు మెంబర్ స్థానానికి ఒక్కో నామినేషన్ అందిందని ఎంపీడీఓ తెలిపారు.


గజపతినగరం: లోగీశ సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేస్తున్న లోగిశ అమ్మన్న


బొండపల్లి: దేవుపల్లి-13వ వార్డుకు నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు


కొత్తవలస : తుమ్మికాపల్లి 3వ వార్డుకు నామినేషన్ వేస్తున్న అభ్యర్థి జ్యోతి

## సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం


గరివిడి మండలం తాటిగూడ గ్రామంలో పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మొద్దు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తున్నారని, పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు నవ రత్నాల పథకాలు దోహదం చేస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గరివిడి మండలంలోని తాటిగూడ గ్రామంలో గురువారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. అంతకుముందు నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకులు అప్పుడప్పు డూ గ్రామాల్లోకి వచ్చి వారు అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయకపోయినప్పటికీ అభివృద్ధి అంతా తామే చేశామని మాయమాటలు చెబుతారని, అలాంటి వారిని నమ్మకండని ప్రజలకు హితవు పలికారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏమైనా అభివృద్ధి చేసిందా, శాశ్వతంగా చేసిన అభివృద్ధి పనులు ఏమైనా ఉన్నాయా అని ప్రజలను ప్రశ్నించారు. టీడీపీకి ప్రజలు పలుమార్లు అధికారం ఇచ్చిన ప్పటికీ చేసింది ఏమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శాశ్వత అభివృద్ధి చేసి చూపించామన్నారు. ఈ గ్రామ ప్రజలకు రూ.5.77 కోట్ల రూపాయలను వివిధ పథకాల రూపంలో అందించామని, గ్రామంలో ఉన్నత పాఠశాలను రూ. 1.22 కోట్లతో, ప్రాథమిక పాఠశాలను రూ.18లక్షలతో అభివృద్ధి చేశామని చెప్పారు. గ్రామ బీటీ రోడ్డు పునరుద్ధరణకు రూ. 38 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింట కుళాయిల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తానని 2014లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు .. ఆ తర్వాత రుణమాఫీ చేయకుండా మహిళలను మోసం చేశారని గుర్తు చేశారు. సీఎం జగన్ మాత్రం ఇచ్చినమాట ప్రకారం విడతల వారీ డ్వాక్రా మహిళలకు రుణమాఫీ డబ్బులను ఖాతాల్లో జమచేస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి ,విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక, ఆసరా, చేయూత వంటి అనేక పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా అందిస్తున్న ఘన త సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. స్థానిక సర్పంచ్ యడ్ల వెంకటరమణమ్మ, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, పీఏసీఎస్‌ల అధ్యక్షులు యడ్ల అప్పారావు, లెంక శ్రీరాములు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు,"వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి పొన్నాడ కుమార్, ఎంపీడీఓ జి.భాస్కరరావు, పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


చీపురుపల్లి మండలం పేరిపి గ్రామంలో సీఎం జగన్ సందేశ పత్రాన్ని లబ్ధిదారులకు అందజేస్తున్న నాయకులు,అధికారులు

**గడప గడపకూ సంక్షేమం**

చీపురుపల్లిరూరల్: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు అన్నారు. మండలంలోని పేరిపి గ్రామంలో గురువారం' గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి హామీ ఇచ్చారు. సర్పంచ్ కోరాడ పృథ్వీ, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, స్థానిక నాయకులు పతివాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల అడుగుజాడల్లో నడుద్దాం

- 'నా భూమి–నా దేశం' లో ప్రజాప్రతినిధులు


చీపురుపల్లి సచివాలయం-4 వద్ద 'నాభూమి-నా దేశం' శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష తదితరులు


చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం అర్తమూరు పాఠశాలలో దీపాలు పట్టుకుని ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, విద్యార్థులు


కొత్తవలస : ముసిరాంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది


మెరకముడిదాం: రాచగుమడాంలో 'నాభూమి-నాదేశం' శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీఓ పెదఅప్పలనాయుడు


దత్తిరాజేరు: ఇంగిలాపల్లిలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు


లక్కవరపుకోట:భీమాళి సచివాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రత్యేకాధికారి గాయత్రీదేవి

చీపురుపల్లి: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పట్టణంలోని సచివాలయం-4 పరిధిలో 'నా భూమి- నాదేశం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 'నా భూమి–నా దేశం' శిలాఫలకాన్ని ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష ఆవిష్కరించారు. దీపాలు పట్టుకుని మహనీయుల అడుగుజాడల్లోనడుద్దామని, మొక్కలు నాటి సంరక్షిద్దామని ప్రతిజ్ఞ చేశారు. మాజీ సైనికులను సత్కరించడంతో పాటు మొక్కలు నాటారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధారాణి, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ పాల్గొన్నారు.

**రాచగుమడాంలో...**

మెరకముడిదాం:ఉపాధి హామీ ఏపీ ఓఎస్.పెదఅప్పలనాయుడు ఆధ్వర్యంలో రాచగుమడాం గ్రామంలో ఉపాధి వేతనదారులు గురువారం మొక్కలు నాటారు. నా భూమి-నాదేశం శిలాఫలకాన్ని ఏపీఓ ఆవిష్కరించారు.గ్రామపెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**అర్తమూరులో..**

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని అర్తమూరు ప్రాథమికోన్నత పాఠశాలలో 'నా భూమి- నా దేశం' కార్యక్రమాన్ని సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ గురునాయుడు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అమరవీరులను స్మరించుకున్నారు.

**మొక్కలతోనే మనుగడ**

దత్తిరాజేరు: మొక్కలతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు అన్నారు. ఇంగిలాపల్లిలో సర్పంచ్ గర్భాపు విజయ లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు.

**ముసిరాంలో..**

కొత్తవలస: ముసిరాం గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ వై.పద్మజ 'నాభూమి–నాదేశం' శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో సచివాలయ సిబ్బంది, నాయకులతో కలిసి మొక్కలు నాటారు.

**శ్రీరాంపురం,భీమాళిలో ..**

లక్కవరపుకోట: శ్రీరాంపురం, భీమాళి గ్రామాల్లో 'నాభూమి- నాదేశం' శిలాఫలకాలను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి గాయత్రీదేవి గురువారం ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటి, ప్రతిజ్ఞ చేశారు.